రోడ్లకు మహర్దశ

రూ. 20 కోట్లతో అభివృద్ధి పనులు



మచిలీపట్నం బైపాస్‌రోడ్డులోని జీజీఎం చర్చి సమీపంలో సిమెంటు రోడ్డు

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు డివిజన్లలో రోడ్లకు మహర్దశ పట్టింది. రోడ్ల నిర్మాణంతో పాటు అవసరమైన చోట్ల మరమ్మతులు చేస్తున్నారు. ఇక్కడ రోడ్లు, డ్రైయిన్ల అభివృద్ధికి వైఎస్సార్ సీపీ బందరు ఇన్‌చార్జి పేర్ని కిట్టు నిధులు కావాలని కోరడంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రూ. 20 కోట్లు మంజూరు చేశారు. వీటితో పనులు ప్రారంభించారు. శంకుస్థాపన అనంతరం పక్కా రహదారి, డ్రైయిన్ పనులు ఓ వైపు పూర్తవుతుండటంతో విమర్శలు చేస్తున్న ప్రతిపక్ష పార్టీలకు చెంపపెట్టులా మారుతోందని ప్రజలు పేర్కొంటున్నారు.

రూ. 20 కోట్లతో 77 పనులు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా విడుదల చేసిన రూ. 20 కోట్లతో నియోజకవర్గంలో 77 పనులు చేస్తున్నారు. వీటిలో కొన్ని పూర్తవ్వగా మరికొన్ని పనులు ప్రారంభ దశలో ఉన్నాయి. ముఖ్యంగా సిమెంటు రోడ్లు, పక్కా డ్రైయిన్లు, ఆరు కమ్యూనిటీ హాళ్లు, నగరంలోని అంబేడ్కర్ భవన్ అభివృద్ధి తదితర పనులు ఉన్నాయి. ఇవన్నీ యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి.

రహదారులకు మరమ్మతులు

నగరంలో దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు ముమ్మరంగా సాగుతున్నాయి. నగరంలోని కోనేరు సెంటరు నుంచి మూడు స్తంభాల సెంటరు వరకు ఉన్న రహదారికి రెండు రోజులుగా మరమ్మతులు చేస్తున్నారు. చల్లపల్లి బైపాస్‌రోడ్డులోని డంపింగ్‌యార్డు నుంచి ఆంధ్రజాతీయ కళాశాల వరకు ఉన్న రహదారికి కూడా మరమ్మతులు చేస్తున్నారు.



ఆంధ్ర జాతీయ కళాశాల రహదారికి మరమ్మతులు

టెంకాయ కొట్టిన రెండు రోజుల్లోనే పనులు



టెంకాయ కొట్టిన రెండు రోజుల్లోనే సిమెంటు రోడ్డు పనులు పూర్తి చేశారు. ఈ ప్రాంతంలో రోడ్డు అభివృద్ధి చేయాలని పేర్ని కిట్టును కోరాం. స్పందించిన ఆయన వారం క్రితమే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు మాకెంతో ఉపయోగం.

–బోయిన మంగతాయారు, బైపాస్‌రోడ్డు

పోతురాజు జాతర మహోత్సవం



స్వామికి నైవేద్యాలు, మొక్కుబడులు చెల్లించడానికి గుడికి తరలివస్తున్న భక్తులు

నాగాయలంక: గ్రామంలో బోసుబొమ్మ సర్కిల్‌లోని శ్రీపోతురాజుస్వామి వార్షిక జాతర మహోత్సవం, గుడి సంబరం ఆదివారం కోలాహలంగా జరిగింది. పోతురాజుకు మొక్కుబడులు చెల్లించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పల్నాటి ఆచారవంతుల పర్యవేక్షణలో జాతర సాంప్రదాయాలకు అనుగుణంగా రజక పూజారులు ప్రత్యేక పూజలు చేసి, చద్దినైవేద్యాలు స్వీకరించారు. తొలుత అనవాయితీ ప్రకారం గ్రామంలోని పల్లయ్యగారి ముఠా జాతరకు శ్రీకారం చుట్టారు. డప్పు నృత్యాలు, మేళతాళాలతో, నైవేద్యాల కావళ్లతో భక్తులు బంధుమిత్రులతో కలసి భారీగా తరలివచ్చారు. శనివారం రాత్రి ఘటాల గ్రామోత్సవం ముగించుకుని ఆదివారం తెల్లవారు జామున గుడికి చేరుకోవడంతో సంబరం ఆరంభించారు. గడ్డిపాటి ఉమా వెంకటేశ్వరరావు(హైదరాబాద్ చిన్న) ఆర్థిక సౌజన్యంతో ఆలయ ప్రాంగణంలో 50 మంది వృద్ధులకు చీరలు, పంచెలు అందజేశారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్, ఆలయ పునర్నిర్మాణ దాత కంఠంనేని ప్రేమ్‌చంద్ ఏఎంసీ మాజీచైర్మన్ మండవ బాలవర్ధిరావు, ఉపసర్పంచి తలశిల వెంకట నరసింహారావు(నాని), శ్రీరామపాదక్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తదితర ప్రముఖులు పోతురాజుస్వామిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎనిమిది వేలమంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు. నిర్వాహక కమిటీ ప్రతినిధులు ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్(బుజ్జి), గడ్డిపాటి ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా లక్ష్మీనాంచారమ్మ ఉత్సవాలు

లక్ష్మీపురం(చల్లపల్లి): గ్రామంలోని శ్రీ బాలా త్రిపురసుందరీ సహిత శ్రీ లక్ష్మీ నాంచారమ్మ ఆలయ వార్షిక వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆయన తనయుడు వికాస్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కమిటీ పెద్దలు దాలిపర్తి నారాయణరావు, మోదుమూడి కుటుంబరావు, ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శివ, వేద పండితులు ఘనంగా స్వాగతం పలుకగా, దర్శనం అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పెడన మున్సిపల్ కమిషనర్ మహేంద్ర మృతి



పెడన: పెడన మున్సిపల్ కమిషనర్ బి.మహేంద్ర(52) ఆదివారం మృతి చెందారు. ఆరు నెలల క్రితం ఆయన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనారోగ్య కారణాలతో జనవరి నుంచి ఆయన సెలవులో ఉన్నారు. ఏలూరులో ఉంటున్న ఆయన తీవ్ర అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన విజయవాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మరణించారు. ఆయనకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. ఆయన మృతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు కటకం నాగకుమారి, ప్రసాద్, వైస్ చైర్మన్‌లు ఎండీ ఖాజా, బైలపాటి జ్యోతి, మాజీ చైర్‌పర్సన్ దంపతులు బళ్ల జ్యోత్స్నరాణి, గంగయ్యలు, కౌన్సిలర్లు, ఆకోప్షన్ సభ్యులు తదితరులు సంతాపం తెలిపారు.

ముగిసిన జ్యోతిర్మహోత్సవాలు

గూడూరు: కప్పలదొడ్డిలో జరుగుతున్న చౌడేశ్వరి అమ్మవారి జ్యోతిర్మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు ఆదివారం రాత్రి అమ్మవారి నగరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దేవాంగులు కత్తులతో ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజు భారీ అన్నసమారాధన జరిగింది.

ఘనంగా మెహర్ బాబా జయంతి

చల్లపల్లి: అవతార్ మెహర్ బాబా 103వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం స్థానిక ట్రావెలర్స్ బంగళా సమీపంలోని బాబా సెంటరులో ఉదయం సంకీర్తన, అవతారుని జనన సమయాన హారతి, ఆధ్యాత్మిక ప్రసంగాలు, మధ్యాహ్నం అన్నసమారాధన, సాయంత్రం పేరంటం, ఉయ్యాల, రాత్రి బాబా సంకీర్తనతో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమం ఏర్పాట్లను బాబా సెంటర్ అధ్యక్ష, కార్యదర్శులు చుండూరు మెహర్ ప్రసాద్, పత్రి వెంకట రమణారావు పర్యవేక్షించారు.

మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- చల్లపల్లిలో జగనన్న విలేజ్ క్లినిక్, నడకుదురులో సచివాలయం ప్రారంభం



నడకుదురులో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే రమేష్‌బాబు

చల్లపల్లి: రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం చల్లపల్లి ఎస్టీ కాలనీలో రూ.20.80 లక్షలతో నిర్మించిన హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, నడకుదురులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాలను ఎమ్మెల్యే రమేష్‌బాబు ప్రారంభించారు. నడకుదురులో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు, విస్తృత గ్రామీణ అభివృద్ధికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఓడించే దమ్ము లేక చంద్రబాబు పవన్ కల్యాణ్‌ను కలుపుకున్నారన్నారు. ఇప్పుడు ఆ బలం కూడా సరిపోక బీజేపీతో పొత్తు కోసం పాకులాడుతున్నారని తెలిపారు. గతంలో టీడీపీతో పొత్తు పెట్టుకుని కమ్యూనిస్టులు మోసపోయారన్నారు. నడకుదురు గ్రామంలో దాదాపు రూ.కోటితో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నేత సింహాద్రి వికాస్‌బాబు, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు శీరం వెంకట సత్యనారాయణ (నాని), మండల మహిళా కన్వీనర్ బొందలపాటి లక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ యడ్ల జగదీష్, సర్పంచ్‌లు గొరిపర్తి సురేష్ బాబు, వల్లూరు ఉమా, తోట శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీలు మోపిదేవి ద్వారకానాథ్, డొక్కు దేవేంద్రరావు, నూకల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్లు అరజా శివశంకర్, యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టి.కొత్తపాలెంలో రంగా విగ్రహావిష్కరణ



టి.కొత్తపాలెం వద్ద రంగా విగ్రహం ఆవిష్కరించిన రాధా, బాలశౌరి, సింహాద్రి తదితరులు

టి.కొత్తపాలెం(నాగాయలంక): రాధా రంగా మిత్ర మండలి, టి.కొత్తపాలెం యువసేన ఆధ్వర్యంలో కాపు ఉద్యమనేత, మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన రంగారావు విగ్రహాన్ని ఆదివారం రాత్రి రంగా తనయుడు వంగవీటి రాధాకృష్ణ, బందరు ఎంపీ వి.బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఆవిష్కరించారు. నాగాయలంక-ఏటిమొగ మెయిన్ రోడ్డులో టి.కొత్తపాలెం ఇరిగేషన్ బంగళా కూడలిలో ఈ విగ్రహం ఏర్పాటు చేశారు. నేతలు మాట్లాడుతూ రంగా ఏ ఒక్క కులానికో నాయకుడు కాదన్నారు. రంగా ఆశయం సఫలం కావాలంటే అన్ని కులాల సమన్వయం, సయోధ్యతోనే రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో బండ్రెడ్డి రామకృష్ణ, చిలకలపూడి పాపారావు, రాధారంగా మిత్రమండలి, యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు. తొలుత మర్రిపాలెం వంతెన సెంటర్, నాగాయలంక బస్టాండ్ చౌరాస్తాలో రంగా విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెదప్రోలులో వివాదం.. ఇద్దరికి గాయాలు

పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన వివాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారిని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ఆలయ ప్రాంగణంలో గ్రామసభ నిర్వహించారు. వాద, ప్రతివాదనలతో గౌరం హర్షవర్ధన్, శివప్రసాద్‌లు యన్నం శ్రీనివాసరావు, యన్నం వెంకటేశ్వరరావు(చంటి)పై కుర్చీలు ఇసరడంతో శ్రీనివాసరావు ముక్కుకు, చంటి తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో క్షతగాత్రులను 108 వాహనంలో అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచనల మేరకు శ్రీనివాసరావును మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు తెలిసింది. వివాదానికి సంబంధించి పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

కొండలమ్మకు మొక్కుల చెల్లింపు

గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు ఆలయంలో క్యూల్లో భక్తులు ఆదివారం అధికసంఖ్యలో బారులు తీరారు. అమ్మవారికి మహిళా భక్తులు పాల పొంగళ్లను సమర్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఏర్పాట్లు చేశారు.

వైభవంగా భావనారుషి కల్యాణం

లక్ష్మీపురం(చల్లపల్లి): శ్రీ భద్రావతి సమేత శ్రీ భావనారుషి స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. లక్ష్మీపురం శివారు శివరామ దుర్గాపురం పద్మశాలిపేటలో కొలువై ఉన్న భావనారుషి స్వామివారి దేవాలయంలో ఆదివారం వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. పద్మశాలీయ బహోత్తమ సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

నేడు గంగానమ్మకు జలాభిషేకం



కోడూరు: భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కోడూరు గంగాభవాని అమ్మవారి 12వ పునఃప్రతిష్ఠోత్సవాల్లో భాగంగా సోమవారం మూలమూర్తికి జలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటలకు అభిషేకాలు ప్రారంభమవుతాయని, భక్తులు స్వయంగా అమ్మవారిని జలాలతో అభిషేకించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం సామూహిక కుంకుమార్చన, అమ్మవారికి విశేష పూజలు ఉంటాయని పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మహాచండీ యాగం, అన్నసమారాధన నిర్వహించనున్నట్లు చెప్పారు.

పోలీసుల అదుపులో జూదరులు

పెడన: పట్టణంలోని బ్రహ్మపురం కాలనీలో జూదమాడుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నట్లు పెడన పోలీసులు తెలిపారు. ఆదివారం వేకువ జామున అందిన సమాచారంతో పెడన ఎస్‌ఐ సూర్యశ్రీనివాస్ ఆధ్వర్యంలో దాడులు చేయగా 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.1,14,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజల వద్దకే జగనన్న పాలన

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



పెదప్రోలులో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

పెదప్రోలు(మోపిదేవి): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకే పాలన కొనసాగిస్తూ అందరి మన్నన పొందుతున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. పెదప్రోలులో రూ.43.60 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆదివారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో ఆర్‌బీకే, హెల్‌నెస్‌సెంటర్ ద్వారా 105 రకాల మందులు అందిస్తున్నారని తెలిపారు. నెలకు రెండుసార్లు టెక్నీషియన్ గ్రామానికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని గుర్తుచేశారు. మూతపడుతున్న ప్రభుత్వ పాఠశాలను నాడు-నేడు పేరుతో అభివృద్ధి చేసి విద్యారంగానికి చేయూత నిచ్చారని తెలిపారు. విద్య, వైద్యం ఉచితంగా పేదలకు అందిస్తున్నారనే కోపంతో కార్పొరేట్ వ్యాపార సంస్థలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జగనన్నను ఓడించాలని చూస్తున్నారని, పేదలకు అండగా ఉన్న సీఎంను ఎవ్వరూ ఏమీ చేయలేరని స్పష్టంచేశారు. చంద్రబాబు బలంగా ఉంటే పవన్‌కు 24 సీట్లు ఎందుకు ఇచ్చారని, బీజేపీ కోసం ఎందుకు వెంపర్లాడుతున్నాడన్నారు. నియోజకవర్గంలో బుద్ధప్రసాద్‌కు సీటు రాకపోతే చంద్రబాబు చెడ్డవాడుగా కనపడుతున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లు తాను జనంతో ఉన్నానని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరవేయడంలో బాధ్యత వహించాను కాబట్టే జగనన్న మరోసారి అవకాశం కల్పించారని, కచ్చితంగా గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రజల దీవెనలతో మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయన్నారు. సర్పంచ్ పాలిమెట్ల ఏసుబాబు, పీఏసీఎస్ చైర్ పర్సన్‌లు ఆది రాంబాబు, రావి రాంప్రసాద్, రెడ్రౌతు వెంకటరమణ, మండల ఎస్సీసెల్ కన్వీనర్ చోడాబత్తిన పూర్ణచంద్రరావు, గ్రామ పార్టీ కన్వీనర్ జన్యావుల రామమోహనరావు, లింగం జగదీష్‌కుమార్, ఆకుల వెంకట్రామయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ పరమేశ్వరి, రాణి, కత్తుల శ్రీనివాసరావు, మట్టా కమలాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేదవాడి సంతోషంలో జగనన్నే..

ప్రజాదీవెనలో ఉప్పాల రాము, హారిక



కృత్తివెన్ను ప్రజాదీవెనలో మహిళలతో మాట్లాడుతున్న ఉప్పాల రాము, హారిక

కృత్తివెన్ను: ప్రతి పేదవాడి సంతోషంలోనూ జగనన్నే ఉంటాడని రాష్ట్రానికి మరింత మంచి జరగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని పెడన నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి ఉప్పాల రాము అన్నారు. ఆయన జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారికతో కలసి ఆదివారం కృత్తివెన్నులో జరిగిన ప్రజాదీవెన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రతి గృహాన్ని సందర్శిస్తూ జగనన్న ప్రభుత్వంలో వారి కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అందరూ ఫ్యాను గుర్తుపై ఓటేసి జగనన్నకు మద్దతు పలకాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి మాటలు నమ్మొద్దు.. అందుతున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధిని చూడండి మీ మనస్సాక్షిగా ఓటేయండి అని రాము కోరారు.

మహిళల పక్షపాతి జగనన్న

డ్వాక్రా రుణమాఫీ చేసిన మహిళా పక్షపాతి సీఎం జగనన్న అని జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జగనన్నను మనమంతా ఆశీర్వదించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఆర్టీసీ కృష్ణా జోనల్ చైర్మన్ పి.మహేష్, ఎంపీపీ గరుడప్రసాద్, జెడ్పీటీసీ రత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ గంగాధర్, పార్టీ మండల కన్వీనర్ వెంకట్రాజు, దేవస్థాన బోర్డు సభ్యులు సత్యవతి, మైనారిటీ నాయకురాలు షేక్‌బేగం పాల్గొన్నారు.

నేటి నుంచి రాములోరి ప్రతిష్ఠా మహోత్సవాలు

- పూర్తయిన కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పనులు
- ప్రారంభానికి సిద్ధమైన ప్రాచీన ఆలయం



శ్రీ సీతాసమేత హరి కోదండరామాలయం

మచిలీపట్నంటౌన్: రాజుపేట పెద్దవీధిలో 170 ఏళ్ల ప్రాచీన శ్రీ సీతాసమేత హరి కోదండ రామాలయం జీర్ణోద్ధరణ పనులు పూర్తయ్యాయి. పూరిపాకలో, చిన్నపాటి షెడ్డులో నిర్వహించిన ఈ ఆలయాన్ని దాతల సహకారంతో నిర్మించారు. టీటీడీ శ్రీ శ్రీవాణి పథకం ద్వారా రూ. 10 లక్షల విరాళం, భక్తుల విరాళాలు సమర్పించారు. ఆలయ పునః ప్రతిష్ఠ మహోత్సవం, ఆలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయ, గణపతి, సరస్వతి పాలరాతి, పంచలోహ విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం ఈ నెల 26వ తేదీ సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 27వ తేదీన పలు పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 28వ తేదీ బుధవారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఉదయం 9.53 గంటలకు నిర్వహించనున్నారు. అదేరోజు సీతారామ కల్యాణంతో పాటు మధ్యాహ్నం అన్నసమారాధన జరగనుంది.

ప్రశాంతంగా గ్రూపు-2 పరీక్ష



పెడన: గ్రూపు-2 ప్రిలిమ్స్ పరీక్ష ఆదివారం ఉదయం పెడనలో ప్రశాంతంగా జరిగింది. పెడనలోని నందమూరు శ్రీవాసవి ఇంజినీరింగ్ కళాశాలలో వెయ్యి మంది అభ్యర్థులకు 744 మంది హాజరయ్యారని, 256 మంది ఆబ్సెంట్ అయినట్లు ఇన్‌చార్జి గుప్తా తెలిపారు. పెడన తహసీల్దారు కె.రాంబాబు పరీక్ష ఏర్పాట్లు, కేంద్రాన్ని పర్యవేక్షించారు. పల్లోటి ఇంగ్లిష్ మీడియం హైస్కూలులో 200 మందికి 141 మంది హాజరయ్యారని పరీక్ష సీఎస్ హనుమంతరావు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం



అంగలూరులోని డైట్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

గుడ్లవల్లేరు: అంగలూరులోని ప్రభుత్వ జిల్లా ఉపాధ్యాయ శిక్షణ సంస్థ(డైట్)లో ఆదివారం పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. 1984–85వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు తమకు విద్యను అందించిన అధ్యాపకులను సన్మానించారు. 38ఏళ్ల తర్వాత ఆనాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ కె.లక్ష్మీనారాయణ, అధ్యాపకులు వై.వరకుమార్, కె.రామచంద్రరావు. పి.వినయ్‌కుమార్, మోహినీకుమారి, రాజ్యలక్ష్మి, ఆర్గనైజింగ్ కమిటీ ఎ.సుబ్రహ్మణ్యం, టి.శ్రీనివాసరరావు, వి.బాలాజీ, ఇ.వెంకటేశ్వరరావు, జి.విజయ్‌కుమార్, కె.రామకృష్ణారావు, ఎ.వరలక్ష్మి, కె.అన్నపూర్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు మోపిదేవిలో పోలీస్‌స్టేషన్ ప్రారంభం



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవిలో కొత్తగా నిర్మించిన పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఉదయం 11.34 గంటలకు ప్రారంభించనున్నట్లు చల్లపల్లి సీఐ నాగప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పెదప్రోలులో ఆదివారం స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుకు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

క్రికెట్ కిట్ అందజేత



అవనిగడ్డ: స్థానిక నేరెళ్లపాలెం, 3, 6 వార్డులోని బ్యాండ్ బాయ్స్ గ్రూపు సభ్యులకు శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ కన్వీనర్ తోట శ్యాంకిశోర్‌నాయుడు క్రికెట్ కిట్ అందించారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో రేమాల శ్రీనివాస్, తోట శ్యాంకృష్ణ, ధీరాజ్, ఆకుల కామేశ్వరరావు, నరేంద్రతో పాటు పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

సాగరతీరంలో పర్యాటకుల సందడి



కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో మాఘపౌర్ణమి నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తీరానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడూరు పోలీసులు, పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు తీరం వెంట గస్తీ నిర్వహించారు.

యానాదులకు వాటర్‌పైపులు అందజేత



కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరు వారిపాలెంలోని జగనన్న లే అవుట్‌లో తొమ్మిది మంది యానాదులు నిర్మిస్తున్న గృహ అవసరాలకు ఆదివారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తనయుడు వికాస్‌బాబు వాటర్ పైపులు అందజేశారు. ఆయన వెంట అవనిగడ్డ జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, యూత్ కన్వీనర్ బచ్చు దిలీప్, మండల గృహనిర్మాణశాఖ ఏఈ రాజులపాటి తాండవ కృష్ణ, వైఎస్సార్ సీపీ నేత రమేష్ పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు



మచిలీపట్నంటౌన్: కృష్ణ కమ్మవారి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బైపాస్ రోడ్డులోని కమ్మవారి కల్యాణ మండపంలో ఉచిత రక్తపరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. శ్రీ దివ్య అపోలో డయాగ్నస్టిక్ సెంటర్ సిబ్బంది 75 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. వైద్యశిబిరాన్ని సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వేమూరి బాలరత్నం, చెరుకూరి కోటేశ్వరరావు ప్రారంభించారు. కార్యవర్గ సభ్యులు వీఎస్ఎస్ కోటేశ్వరరావు, కోనేరు రమేష్, 1వ వార్డు కార్పొరేటర్ జోగి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆదిలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని భోగాది అచ్చిరెడ్డి ముఠా ఆధ్వర్యంలో భోగాది అప్పారాయుడు స్థలంలో నిర్మించిన దేవాలయంలో శ్రీఆదిలక్ష్మీదేవి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు రెండోరోజు ఆదివారం శాస్త్రోక్తంగా జరిగాయి. యాగ్నిక బ్రహ్మ కె.రమణాచార్యులు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. సోమవారం ఉదయం 10.10 గంటలకు శ్రీఆదిలక్ష్మి యంత్రస్థాపన, నూతన శిల విగ్రహ ప్రతిష్ఠ, అన్నసమారాధన జరుగుతాయని నిర్వాహక కమిటీ తెలిపింది.